క్లుప్తంగా

24న సభకు తరలిరావాలి

నిర్మల్‌చైన్‌గేట్: పీడీఎస్‌యూ అర్ధశతాబ్దపు వేడుకలపై హైదరాబాద్‌లో ఈనెల 24న నిర్వహించే బహిరంగసభకు విద్యార్థులు, యువకులు, మేధావులు తరలిరావాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సింగారి వెంకటేశ్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సత్యసాయి ఒకేషనల్ కళాశాలలో సదస్సు నిర్వహించారు. విద్య కాషాయికరణ, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుదామని పిలుపునిచ్చారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను చెల్లించాలని డిమాండ్ చేశారు. హర్షవర్ధన్, గణేష్, కార్తీక్, రాజ్ వెంకటేష్ పాల్గొన్నారు.

సోయా కొనుగోళ్లు నిలిపివేత

భైంసారూరల్: మండలంలోని మాటేగాం కొనుగోలు కేంద్రంలో రెండు రోజులపాటు సోయా కొనుగోళ్లను నిలిపివేయనున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ దేవేందర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. కేంద్రంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం, అకాల వర్షాల కారణంగా పంట నిల్వలు పెరిగిపోయాయని.. రైతులు గమనించి సహకరించాలని కోరారు.

వైద్యవిద్యార్థికి చేయూత



వైద్యవిద్యార్థికి చెక్కు ఇస్తున్న దాత

నిర్మల్‌ఖిల్లా: జిల్లాకేంద్రానికి చెందిన వైద్యుడు డాక్టర్ కె.రమణేశ్వర్ నిరుపేద విద్యార్థికి రూ. 20వేలను ఆర్థికసాయంగా అందించి అండగా నిలిచారు. నిర్మల్‌కే చెందిన సగ్గం అఖిల్‌సాయి ఇటీవల నీట్ పరీక్షలో ప్రతిభ కనబర్చి తమిళనాడులోని మధురై ఎయిమ్స్‌లో ఎంబీబీఎస్ సీటు సాధించాడు. మంగళవారం తన నివాసంలో డాక్టర్ కుంట రమణేశ్వర్ తండ్రి భూమయ్య.. విద్యార్థి అఖిల్‌సాయికి చెక్కును అందించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అప్పాల అనురాధ తదితరులు పాల్గొన్నారు.

గాలికుంటు నివారణ టీకాలు

సోన్: మండలకేంద్రంలో మంగళవారం గేదెలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. పశువైద్యాధికారి ఓంప్రకాశ్ మాట్లాడుతూ నెలరోజుల పాటు జీవాలకు టీకాలు వేస్తామని.. పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆరు నెలలకోసారి పశువులకు టీకాలు వేయించాలని సూచించారు. జేవీవో మురళి, చిన్న సాయన్న తదితరులు ఉన్నారు.

రోడ్డుపై రెండు తలల పాము



రెండు తలల పాము

లక్ష్మణచాంద: మండలకేంద్రంలో డబుల్ రోడ్డుపై మంగళవారం మధ్యాహ్నం రెండు తలల పాము దర్శనమిచ్చింది. దీంతో అటుగా వెళ్తున్న ప్రయాణికులు తమ వాహనాలను ఆపి ఈ పామును ఆసక్తిగా తిలకించారు.

బ్రెడ్, విద్యాసామగ్రి పంపిణీ

నిర్మల్‌ఖిల్లా: నిర్మల్ సమీపంలోని కొండాపూర్ శాంతినికేతన్ మానసిక వికలాంగుల కేంద్రంలో ఉమ్మడి జిల్లాకు చెందిన పక్షి ప్రేమికుడు, సామాజిక కార్యకర్త జక్కుల వెంకటేశ్ తన జన్మదిన వేడుకలను జరుపుకొన్నారు. వెంకటేశ్ పేరిట ఆయన కూతురు శ్రీహరిణి పోగు చేసుకున్న డబ్బులతో విద్యార్థులకు నోట్‌బుక్‌లు, పెన్నులు, పెన్సిల్లు, బ్రెడ్ పాకెట్లు అందజేశారు. బాలసదనంలో చిన్నారులకు అరటిపండ్లు, బ్రెడ్‌పాకెట్లు అందజేశారు. సేరే రమణ, వ్యాస్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువు తయారు చేయాలి



తయారీ పరిశీలిస్తున్న డీపీవో శ్రీనివాస్

మామడ: తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి సేంద్రియ ఎరువు తయారు చేయాలని డీపీవో శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని సెగ్రిగేషన్ షెడ్డు నిర్వహణను పరిశీలించారు. డ్రెయినేజీల్లో నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం గ్రామపంచాయతీ రికార్డులు పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గంగాసాగర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి మహేందర్ ఉన్నారు.

జెడ్పీ సీఈవో తనిఖీ

తానూరు: మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయాన్ని మంగళవారం జెడ్పీ సీఈవో గోవింద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామాల్లో అభివృద్ధి పనుల నిమిత్తం ఖర్చు చేసిన రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామాల్లో శుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. ఎంపీడీవో అబ్దుల్ సమద్, సూపరింటెండెంట్ వేణుగోపాల్, ఎంపీవో నసిరుద్దీన్ తదితరులు ఉన్నారు.

పోరాట యోధుడు భీం

- బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి
- గ్రామాల్లో మహనీయుడికి ఘన నివాళి



నిర్మల్‌లో నివాళులర్పిస్తున్న శ్రీహరిరావు



నిర్మల్‌లో కుమురం భీం విగ్రహం వద్ద ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి, నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: చరిత్ర మరువని పోరాట యోధుడు కుమురం భీం అని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. కుమురం భీం జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని చైన్‌గేట్ ప్రాంతంలోని భీం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ నిజాం పాలకులు, రజాకార్లపై భీం పోరాటం ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, మున్సిపల్ కమిషనర్ రాజు, బీజేపీ నాయకులు రావుల రాంనాథ్, పట్టణ అధ్యక్షుడు సాదం అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

భీం ఆశయ సాధనకు కృషి చేద్దాం

నిర్మల్‌చైన్‌గేట్: 'జల్, జంగల్, జమీన్' నినాదంతో గిరిపుత్రుల హక్కుల కోసం సాయుధ పోరాటం చేసిన కుమురం భీం ఆశయ సాధనకు కృషి చేయాలని డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు అన్నారు. భీం జయంతి సందర్భంగా చైన్‌గేట్ ప్రాంతంలోని భీం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కమిషనర్ సీవీఎస్.రాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ సామా భీంరెడ్డి, దేవరకోట ఆలయ చైర్మన్ కొండా శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

కడెం: కుమురంభీం పోరాటం మరువలేనిదని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పొద్దుటూరి సతీశ్ రెడ్డి అన్నారు. కడెంలోని భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ మండలాధ్యక్షుడు మల్లేశ్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు రమేశ్, బొడ్డు గంగన్న, ముస్కు రాజు, రమేశ్, లక్ష్మణ్, కమలాకర్, శ్రీనివాస్, బ్రహ్మచారి తదితరులున్నారు.

నర్సాపూర్(జి): మండలంలోని నందన్‌లో నాయక్‌పోడ్ సంఘం ఆధ్వర్యంలో కుమురం భీం జయంతి నిర్వహించారు. సాయన్న, మహేశ్, నితిన్, సతీశ్, సంతోష్, సురేశ్, నరేశ్, నవీన్ తదితరులు ఉన్నారు.

తానూరు: మండలంలోని ఝరి(బి)లో కుమురం భీం జయంతి నిర్వహించారు. నాయక్‌పోడ్ గ్రామ అధ్యక్షులు గణేశ్, లక్ష్మణ్, యువకులు పోతన్న, రమేశ్, బాబన్న, శ్రీనివాస్, సాయినాథ్, గంగాధర్, పోతన్న, భూమన్న తదితరులు పాల్గొన్నారు.



కడెంలో పూలమాల వేస్తున్న కాంగ్రెస్ నాయకులు

దస్తురాబాద్: మండలంలోని గొడిసిర్యాల గోండుగూడ, బుట్టాపూర్, ఆకొండపేట గ్రామాల్లో భీం జయంతి నిర్వహించారు. తుడుందెబ్బ మండల ప్రధాన కార్యదర్శి కిరణ్, ఆదివాసీలు సాగర్, రమేశ్, లక్ష్మణ్, శివకుమార్, రవి, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ముథోల్‌ను విద్యాకేంద్రంగా అభివృద్ధి చేస్తాం

- ఎమ్మెల్యే రామారావు పటేల్



ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

ముథోల్: ముథోల్‌ను విద్యాకేంద్రంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. మంగళవారం ముథోల్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ప్రారంభించి మాట్లాడారు. నియోజకవర్గ కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయడం ద్వారా పేదవిద్యార్థులకు మేలు జరుగుతుందన్నారు. కళాశాలలో లైబ్రరీ, ల్యాబ్, ఎన్‌సీసీ వంటి వసతులు ఏర్పాటు చేస్తామన్నారు. ముథోల్‌లో ఇంటిగ్రేటెడ్ పాఠశాల ఏర్పాటుకు సైతం ఉత్తర్వులు జారీ అయ్యాయని పేర్కొన్నారు. భైంసాకు తరలిన జ్యోతిబాపూలే పాఠశాలను ముథోల్ తీసుకొచ్చామని.. త్వరలో వ్యవసాయ కళాశాలను తీసుకొచ్చే ప్రయత్నాలు చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు కోరి పోతన్న, పీఏసీఎస్ డైరెక్టర్ ధర్మపురి సుదర్శన్, నాయకులు తాటివార్ రమేశ్, మాజీ సర్పంచ్ రాజేందర్, మాజీ ఎంపీటీసీ దేవోజీ భూమేశ్, వీడీసీ సభ్యులు గుంజలోళ్ల నారాయణ, మైత్రి సాయినాథ్, డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

ముథోల్: మండలకేంద్రంలో సోయా కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని మంగళవారం ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్‌కు ముథోల్ గ్రామ రైతులు విన్నవించారు. వర్షాలకు పంట తడిసి నష్టపోతున్నామని వాపోయారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే త్వరలోనే కొనుగోలు కేంద్రం ప్రారంభించేలా చర్యలు చేపడతామని చెప్పినట్లు పేర్కొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



భైంసాలో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

భైంసాటౌన్: రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఉపాధ్యాయులకు పెండింగ్ డీఏ, బిల్లులు, పీఆర్‌సీ వెంటనే ప్రకటించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్రశాఖ పిలుపు మేరకు మంగళవారం ప్రభుత్వ పాఠశాలల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. జిల్లా అధ్యక్షుడు నవీన్‌కుమార్, కార్యదర్శి సుదర్శన్, రాజేశ్వర్, రాంనరేశ్, జస్వాల్, ధీరజ్, పాఠశాలల ఉపాధ్యాయులు ఉన్నారు.

నిర్మల్‌రూరల్: తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం తపస్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు తమ పాఠశాలల్లో నిరసన తెలిపారు. రాష్ట్ర సంఘం పిలుపుమేరకు నల్లబ్యాడ్జీలతో నిరసన చేపట్టినట్లు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నవీన్‌కుమార్, సుదర్శన్ పేర్కొన్నారు. డీఏలు అమలు చేసి పీఆర్‌సీ కమిటీని వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

వర్షంతో.. రైతులకు ఇబ్బంది

లోకేశ్వరం: మండలంలోని హవర్గ, కిష్టాపూర్, లోకేశ్వరం, కన్కపూర్, జోహర్‌పూర్, అబ్దుల్లాపూర్, వాస్తాపూర్, వట్టోలి, ధర్మోర, పంచగుడి తదితర గ్రామాల్లో మంగళవారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షంతో రైతులు ఇబ్బంది పడ్డారు. వరిపొలాలు నేలకొరగగా.. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోయింది.

కుంటాల: మండలంలోని ఓలా, వెంకూర్, కుంటాల గ్రామాల్లో మంగళవారం రాత్రి ఉరుములు, మెరుపులతో తేలికపాటి వర్షం కురిసింది. దీంతో రైతులు ధాన్యం తడవకుండా ముందస్తు చర్యలు తీసుకున్నారు.

సంక్షిప్త వార్తలు

పోచమ్మతల్లి బోనాలు

తానూరు: మండలంలోని నంద్‌గాంలో పోచమ్మతల్లికి మంగళవారం బోనాలను నైవేద్యంగా సమర్పించారు. మొక్కులు చెల్లించుకొని పంటలు సమృద్ధిగా పండాలని వేడుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

నూతన కార్యవర్గం

కుంటాల: మండలంలోని విఠాపూర్‌లో జై మాల నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సంఘరతన్, కోశాధికారిగా ఎం.లక్ష్మణ్, కార్యదర్శిగా దిగంబర్, ప్రధాన కార్యదర్శిగా గంగాధర్, సభ్యులను అంబేద్కర్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు దిగంబర్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు.

ట్యాంకులను శుభ్రం చేయించాలి

ఖానాపూర్: తాగునీటిని సరఫరా చేసే ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించి.. ప్రజలకు శుద్ధజలం అందించాలని ఎంపీవో రత్నాకర్‌రావు.. పంచాయతీ సిబ్బందికి సూచించారు. మంగళవారం మండలంలోని దిలావార్‌పూర్, బావాపూర్(కే), గోసంపల్లె, పాతఎల్లాపూర్, కొత్తపేట్, గోడలపంపు గ్రామాల్లో పర్యటించారు. పంచాయతీల్లో పారిశుధ్య పనులు, రికార్డులను పరిశీలించారు. అనంతరం బావాపూర్(కే)లో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని సందర్శించారు.

చండీయాగం కరపత్రాలు ఆవిష్కరణ

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలో నవంబర్ 8 నుంచి 25 వరకు నిర్వహించే శ్రీ వైష్ణవ ఆయుత చండీయాగానికి సంబంధించిన కరపత్రాలను శ్రీకష్ణ పీఠాధిపతి జ్యోతి స్వరూపానంద స్వామిజీ మంగళవారం ఆవిష్కరించారు. దేవరకోట మాజీ చైర్మన్ ఆమెడ శ్రీధర్ మాట్లాడుతూ యాగంలో పట్టణవాసులు పాల్గొనాలని కోరారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

సారంగపూర్: మండలంలోని జామ్ గ్రామంలో సిలారి గణేశ్ తల్లి, జంగం మహేశ్ తండ్రి ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే, బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి పరామర్శించారు. సారంగాపూర్‌లో బాధిత కుటుంబాలను పరామర్శించి ధైర్యం చెప్పారు. సత్యనారాయణగౌడ్, రావుల రాంనాథ్, రాజేందర్‌రెడ్డి, మంతెన గంగారెడ్డి, రాజలింగం, విలాస్, తిరుమలచారి, చెన్ను రాజేశ్వర్, నారాయణ, మధు తదితరులు ఉన్నారు.

చండీ హోమం ప్రారంభం

కుంటాల: మండలంలోని ఓలా శ్రీ విఠల-రుక్మాబాయి ఆలయంలో మంగళవారం చండీ హోమం ప్రారంభమైంది. శ్రీ భగవాన్ జోషి ఆధ్వర్యంలో గణపతి, గౌరీ పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామస్తులకు అన్నదానం చేశారు. గండె రాజ్‌కుమార్, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టార్పాలిన్లు పంపిణీ

సారంగపూర్: మండల కేంద్రంలోని మార్కెట్‌యార్డులో కుంటాల మండలంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు మంగళవారం ఏఎంసీ చైర్మన్ అబ్దుల్ హదీ టార్పాలిన్లు, తప్ప, తాలు ఏరివేత యంత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ కార్యదర్శి ధూమ్యానాయక్, బోరిగాం, ధని, ఆలూరు గ్రామాల రైతులు ఉన్నారు.

నేషనల్ క్రైం కంట్రోల్ ఆర్గనైజేషన్ నియోజకవర్గ అధ్యక్షుడిగా జునైద్

ఖానాపూర్: నేషనల్ క్రైం కంట్రోల్ ఆర్గనైజేషన్ ఖానాపూర్ నియోజకవర్గ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన జునైద్ ఖురేషిను నియమించారు. నిర్మల్‌లో సోమవారం జరిగిన సమావేశంలో స్టేట్ సెక్రెటరీ ఫిరోజ్, వైస్ ప్రెసిడెంట్ మోహిద్ నియామకపత్రం అందించినట్లు మంగళవారం జునైద్ తెలిపారు.

వైద్యశిబిరం

కడెం: మండలంలోని గంగాపూర్‌లో కడెం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నాన్ కమ్యూనికేబుల్ డీసీజెస్(ఎన్‌సీడీ)పై మంగళవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. బీపీ, షుగర్‌తో బాధపడుతున్న పలువురిని పీహెచ్‌సీకి రెఫర్ చేశారు. హెచ్‌ఈవో టి.వేణుగోపాల్, సిబ్బంది బ్లెస్సి, రత్న, కొమురయ్య, శశికళ, చంద్రకళ, మమత, హరిప్రియ తదితరులున్నారు.

ఎలక్ట్రికల్ స్టార్టర్ల చోరీ

కుంటాల: కుంటాల నుంచి సేవాలాల్ తండా వెళ్లే మార్గంలో నర్సరీకు చెందిన రూ.2,300 విలువైన స్టార్టర్, జక్కుల రమేశ్ అనే రైతుకు చెందిన రూ.3,800 విలువైన విద్యుత్ మోటార్ స్టార్టర్ సోమవారం రాత్రి చోరీకి గురయ్యాయి. నర్సరీ వద్ద వారం రోజుల కిందట స్టార్టర్ బిగించామని పంచాయతీ కార్యదర్శి రాజబాపు తెలిపారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు.

రికార్డులు పంపిణీ

కుంటాల: దినచర్య రికార్డులను ఆశవర్కర్లు సక్రమంగా నిర్వహించాలని వైద్యురాలు శృతిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కుంటాల పీహెచ్‌సీలో ప్రభుత్వం సరఫరా చేసిన దినచర్య రికార్డులను ఆశవర్కర్లకు పంపిణీ చేసి మాట్లాడారు. ఆశవర్కర్లు సేకరించిన సమాచారం రికార్డుల్లో పొందుపరిచి తమకు ఇవ్వాలని కోరారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

నర్సాపూర్(జి): మండలకేంద్రంతోపాటు రాంపూర్ గ్రామంలో మంగళవారం డ్రై డే నిర్వహించారు. ఈసందర్భంగా పంచాయతీ కార్యదర్శులు రాథోడ్ కైలాస్, నవనీత్‌కుమార్ ఇళ్లల్లో పాతకూలర్లు, డ్రమ్ముల్లో నిల్వనీటిని పారబోయించారు. అంగన్‌వాడీ టీచర్లు గంగామణి, అరుణ, సునీత, అనీస్ బేగం, గోదావరి, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

'ఎమ్మెల్యేపై ఆరోపణలు సరికాదు'

కడెం: ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్‌పై కొందరు ప్రతిపక్ష నాయకులు చేస్తున్న ఆరోపణలు సరికాదని నేతకాని సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కాంగ్రెస్ నేత దుర్గే వెంకటేశ్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గత ప్రభుత్వం పదేళ్లలో చేయని అభివృద్ధి.. ప్రస్తుత ఎమ్మెల్యే ఆరు నెలల్లోనే చేశారన్నారు. అభివృద్ధిని ఓర్వలేకనే ఎమ్మెల్యేపై కొందరు అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు.

సభ్యత్వ నమోదు

దస్తురాబాద్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘంలో చేరాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు భూక్య రాజేశ్‌నాయక్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు మండల కేంద్రంలోని భీం విగ్రహానికి నివాళులర్పించారు. ప్రధానోపాధ్యాయుడు గంగాధర్, ఆత్రం కేశవ్, ఉపాధ్యాయులు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

లక్ష్మణచాంద: మండలంలోని బోరిగాంలో కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ నాయకులు భీమన్న అత్తమ్మ లక్ష్మి మరణించారు. డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు మంగళవారం భీమన్న నివాసానికి వెళ్లి బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. వారి వెంట సోమ భీంరెడ్డి, రఫీ, బాపయ్య తదితరులు ఉన్నారు.

బీఎల్‌వోలకు అవగాహన

ఖానాపూర్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో తహసీల్దార్ శివరాజ్.. మండలంలోని బీఎల్‌వోలకు ఓటరు నమోదుపై మంగళవారం అవగాహన కల్పించారు. నవంబర్ 2021 కంటే ముందు డిగ్రీ పూర్తి చేసినవారు నమోదుకు అర్హులన్నారు. ఆధార్, ఓటరు జిరాక్స్‌లతోపాటు పాస్ ఫొటో, గెజిటెడ్ సంతకంతో ఉన్న డిగ్రీ మెమోను తహసీల్దార్ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. డిప్యూటీ తహసీల్దార్ మంజుల తదితరులు ఉన్నారు.

ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

ఖానాపూర్/కడెం: యువత ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఖానాపూర్‌కు చెందిన వైద్యుడు కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం ఖానాపూర్ నుంచి కడెం ప్రాజెక్ట్ వరకు 23 కిలోమీటర్ల మారథాన్ రన్ నిర్వహించారు. రాజేందర్, అశోక్, నాగరాజు, రాజు, వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు.

అపరిచితులు కన్పిస్తే సమాచారమివ్వాలి

- భైంసారూరల్ సీఐ నైలు
- కార్డన్‌సెర్చ్‌లో 74 బైక్‌లు స్వాధీనం



మాట్లాడుతున్న భైంసారూరల్ సీఐ నైలు

భైంసారూరల్: అపరిచితులు కన్పిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని భైంసారూరల్ సీఐ నైలు అన్నారు. మంగళవారం మండలంలోని వానల్‌పాడ్‌లో పోలీసులు కమ్యూనిటీ కాంటాక్ట్(కార్డన్‌సెర్చ్) నిర్వహించారు. తెల్లవారుజామున గ్రామంలో ఇంటింటికీ వెళ్లి తనిఖీలు నిర్వహించారు. సరైన పత్రాలు లేని 74 ద్విచక్రవాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ వాహనదారులు అన్ని పత్రాలు వెంట ఉంచుకోవాలన్నారు. దుకాణాల్లో మద్య, గుట్కాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలని సూచించారు. తనిఖీల్లో భైంసారూరల్, కుంటాల, ఎస్సైలు శ్రీనివాస్‌యాదవ్, భాస్కరచారి, సిబ్బంది, గ్రామస్తులు ఉన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



ప్రారంభిస్తున్న నిర్మల్‌రూరల్ సీఐ రామకృష్ణ

సారంగపూర్: నేరాల నియంత్రణకు ప్రతి గ్రామంలో వీడీసీల ఆధ్వర్యంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని నిర్మల్‌రూరల్ సీఐ రామకృష్ణ అన్నారు. మంగళవారం మండలంలోని యాకర్‌పెల్లిలో సీసీ కెమెరాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. పని చేయని నాలుగు సీసీ కెమెరాలకు మరమ్మతులు చేయించి కొత్తగా నాలుగు కెమెరాలను ఏర్పాటు చేసిన వీడీసీ సభ్యులను అభినందించారు. కెమెరాల నిర్వహణ బాధ్యతలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామస్తులు రాజేశ్వర్‌రెడ్డి, భోజారెడ్డి, ఇంద్రయ్య, సాయన్న, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

కోతుల నియంత్రణకు చర్యలు తీసుకోండి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న పట్టణవాసులు

ఖానాపూర్: మున్సిపాలిటీలో నిత్యం ఏదో ఓ చోట ప్రజలపై కోతులు దాడులు చేస్తున్నాయని.. కోతుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని పలువురు నాయకులు మంగళవారం తహసీల్దార్ శివరాజ్‌తో పాటు మున్సిపల్ కార్యాలయంలో వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. కోతులు వెంటపడటంతో మృతి చెందిన లక్ష్మి కుటుంబానికి రూ.10 లక్షల నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. బీసీ రాజన్న, నంది రామయ్య, సంజీవ్‌రావు, కొత్తపెల్లి సురేశ్, కొండాడి గంగారావు, తోట సత్యం, రమణయ్య, అనిల్‌రావు, బీరయ్య, మహేశ్వర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

అర్హులు ఓటరుగా నమోదు చేసుకోవాలి



నిర్మల్‌లో ఓటరు నమోదు పత్రాలు ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయులు

భైంసాటౌన్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన ఉపాధ్యాయులు ఓటరు నమోదు చేసుకోవాలని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బివి రమణారావు సూచించారు. మంగళవారం పట్టణంలోని పలు పాఠశాలలు, కళాశాలల్లో ఉపాధ్యాయులు, అధ్యాపకులను కలిసి ఓటరు నమోదుపై వివరించారు. ఆయన వెంట అన్సర్, సలీం హైమద్ ఖాన్, గంగాధర్ తదితరులు ఉన్నారు.

నర్సాపూర్(జి): ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులు ఓటరుగా నమోదు చేసుకోవాలని పీఆర్టీయూ టీఎస్ మండల అధ్యక్షుడు పి.గంగాచరణ్ పేర్కొన్నారు. మంగళవారం మండలకేంద్రంతోపాటు గొల్లమాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ ఓటరు నమోదు పత్రాలను అందజేశారు.

నిర్మల్‌ఖిల్లా: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని మంజులాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం మధ్యాహ్నం ఉపాధ్యాయులకు ఓటరు నమోదు కోసం వినియోగించే ఫాం-19 పత్రాలను పంపిణీ చేశారు. పీఆర్టీయూ టీఎస్ నిర్మల్‌అర్బన్ మండలాధ్యక్షుడు బాల్స గజ్జారాం, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మునీందర్ రాజు, జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు హేమలత తదితరులున్నారు.

ముథోల్: పీఆర్‌టీయూ టీఎస్ అభ్యర్థి వంగ మహేందర్‌ను ఎమ్మెల్సీగా గెలిపించాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.వి రమణారావు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని సాంఘీక సంక్షేమ గురుకులంలో పట్టభద్రుల ఓటరు నమోదుపై అవగాహన కల్పించారు. పీఆర్టీయూ మండలాధ్యక్షులు పి.ప్రవీణ్‌రెడ్డి, అబ్దుల్, అహాది, పి.రవీందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అమరుల త్యాగాలు మరువలేనివి



ఖానాపూర్‌లో విద్యార్థులకు ఆయుధాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ సైదారావు, ఎస్సై

ఖానాపూర్: పోలీస్ అమరవీరుల త్యాగాలు మరువలేనివని ఖానాపూర్ సీఐ సైదారావు, ఎస్సై రాహుల్ అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు ఓపెన్‌హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయుధాలు, సిబ్బంది విధులు, ఎఫ్ఐఆర్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వెపన్ టెక్నీషియన్ వెంకటరమణ, బాంబ్ స్క్వాడ్ సిబ్బంది కాంత్, రాజేశ్ తదితరులు ఉన్నారు.

భైంసాటౌన్: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఓపెన్‌హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పట్టణ సీఐ గోపినాథ్ ఆయా పాఠశాలల విద్యార్థులకు ఆయుధాలు, సాంకేతిక వినియోగం, షీటీం, భరోసా, సైబర్ సెక్యూరిటీ, యాంటీ నార్కోటిక్ డ్రగ్, డాగ్ స్క్వాడ్ విభాగాల విధులు, పోలీసుల ప్రతిభ, త్యాగాలు తదితర అంశాలను వివరించారు.

నర్సాపూర్ (జి): విధినిర్వహణలో అమరులైన పోలీసు వీరులకు మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో మంగళవారం స్థానిక పోలీసులు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి నివాళులర్పించారు. ఎస్సై హన్మండ్లు, ఏఎస్సై మాన్‌సింగ్, మాజీ జెడ్పీటీసీ చిన్నరామయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

దస్తురాబాద్: మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో పోలీస్ అమరవీరులకు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఎస్సై శంకర్, సిబ్బంది శ్రావణ్, నరేందర్, ఉషన్న, రాజలింగం, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలు తనిఖీ

సోన్: మండలంలోని న్యూబొప్పారం, న్యూవెల్మల్, కూచన్‌పెల్లి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను మంగళవారం ఇన్‌చార్జి ఎంఈఓ టి.పరమేశ్వర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో జరుగుతున్న ఎస్సే-1(సమ్మేటివ్ అసెస్‌మెంట్) పరీక్షలను పరిశీలించారు. పాఠశాలల్లో మూత్రశాలలు, తరగతి గదులు శుభ్రం చేసేందుకు, మొక్కలు పెంచేందుకు కార్మికులను నియమించుకోవాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. అనంతరం న్యూవెల్మల, న్యూబొప్పారం అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వందన, వరలక్ష్మి, రాజేశ్వర్, అంగన్‌వాడీ టీచర్లు, అనురాధ, రమాదేవి, రాజమణి తదితరులు ఉన్నారు.

కుంటాల: విద్యార్థులకు ఉత్తమ బోధన అందించాలని ఎంఈవో ముత్యం సూచించారు. మంగళవారం మండలంలోని కల్లూరు ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట హెచ్‌ఎం చంద్రశేఖర్‌రావు ఉన్నారు.

అవగాహన

కుంటాల: సైబర్ నేరాలపై కుంటాలలో మంగళవారం ఏఎస్సై దేవ్‌రావు అవగాహన కల్పించారు. అపరిచితులు ఫోన్ చేస్తే బ్యాంకు వివరాలు చెప్పవద్దని.. అనుమానితులు కన్పిస్తే 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు. రతన్, సవిత రాణి, సాదిక్ ఉన్నారు.